# బలగం BALAGAM TV

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 26 జనవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4





బలగం టీవి పాఠకులు, వీక్షకులకు, ప్రకటనకర్తలు, ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు

**గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు**




## 139 మందికి పద్మ పురస్కారాలు

**ఏఐజీ హాస్పిటల్ ఛైర్మన్ దువ్వూరి నాగేశ్వర్‌రెడ్డికి పద్మ విభూషణ్**

**నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్**

**మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ ప్రకటించింది**







**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పద్మ పురస్కారాలను ప్రకటించింది. వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన వారిని ఈ ప్రతిష్ఠాత్మక అవార్డులకు ఎంపిక చేసింది. గణతంత్ర దినోత్సవం రోజున రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ అవార్డులను అందిస్తారు. కేంద్ర ప్రభుత్వం 139 మందికి పద్మ పురస్కారాలు ప్రకటించింది. ఏడుగురికి పద్మ విభూషణ్, 19 మందికి పద్మభూషణ్, 113 మందికి పద్మశ్రీ వచ్చాయి. టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్‌ను పద్మశ్రీ వరించింది.

రాష్ట్రం నుంచి ప్రముఖ వైద్యులు, ఏఐజీ హాస్పిటల్ ఛైర్మన్ దువ్వూరి నాగేశ్వర్‌రెడ్డికి పద్మ విభూషణ్ ప్రకటించింది. తెలంగాణ నుంచి మందకృష్ణ మాదిగకు ప్రజావ్యవహారాలు విభాగంలో పద్మశ్రీ ప్రకటించింది. మరోవైపు కళల విభాగంలో నందమూరి బాలకృష్ణకు ఆంధ్రప్రదేశ్ తరపున పద్మభూషణ్ ప్రకటించారు.



తెలంగాణ నుంచి ఇద్దరికి పద్మ అవార్డులు వరించాయి.ఏపీ నుంచి ఐదుగురు పద్మ అవార్డులకు ఎంపికయ్యారు.అలాగే, కేజీఎఫ్ నటుడు ఆనంత్‌నాగ్‌కు పద్మభూషణ్, ప్రముఖ తమిళ హీరో అజిత్‌కుమార్‌కు పద్మభూషణ్, ప్రముఖ సినీ నటి, నృత్యకళాకారిణి శోభనకు పద్మభూషణ్ అవార్డులను ప్రకటించింది. కేఎల్ కృష్ణ (సాహిత్యం-విద్యారంగం), మాడుగుల నాగఫణి శర్మ (కళలు), మిర్యాల అప్పారావు (కళలు-మరణానంతరం), వాదిరాజు రాఘవేంద్రాచార్య పంచముఖి (సాహిత్యం-విద్యారంగం)కు పద్మశ్రీ అవార్డులు వరించాయి.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మ శ్రీ పురస్కారాలకు ఎంపికైన ప్రముఖులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అభినందనలు తెలిపారు. వైద్యరంగంలో విశేష సేవలు అందించిన డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డికి పద్మవిభూషణ్, సినిమా రంగంలో తనదైన ముద్ర వేసిన నందమూరి బాలకృష్ణకి పద్మ భూషణ్, ప్రజా వ్యవహారాల విభాగంలో మంద కృష్ణ మాదిగకి, కళలు, సాహిత్యం, విద్యా విభాగాల్లో కే.ఎల్.కృష్ణ గారు, మాడుగుల నాగఫణిశర్మ , దివంగత మిర్యాల అప్పారావు, రాఘవేంద్రాచార్య పంచముఖిలకు పద్మశ్రీ పురస్కారాలు దక్కడంపై ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. తాము ఎంచుకున్న రంగంలో చేసిన కృషి.. అంకితభావమే వారు దేశంలో ఉన్నత పురస్కారాలకు ఎంపికయ్యేందుకు కారణమయ్యాయని మిగితా 2వ పేజీలో

## పద్మ పురస్కారాల్లో వివక్షపై సీఎం అసంతృప్తి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

పద్మ పురస్కారాల్లో వివక్షపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. పద్మ అవార్డుల పేరుతో తెలంగాణ ప్రజలను కేంద్రం అవమానించిందని మండిపడ్డారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాయాలని నిర్ణయించారు. తెలంగాణ నుంచి రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ (పద్మవిభూషణ్), చుక్కా రామయ్య (పద్మభూషణ్), అందెశ్రీ (పద్మభూషణ్), గోరటి వెంకన్న (పద్మశ్రీ), జయధీర్ తిరుమలరావు (పద్మశ్రీ) వంటి ప్రముఖుల పేర్లను ప్రతిపాదించింది. అయితే వీరిలో ఎవరిని కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోకపోవడం నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను అవమానించడమేనని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. 139 మందికి పురస్కారాలు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు కనీసం అయిదు పురస్కారాలు ప్రకటించకపోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

## హుస్సేన్ సాగర్ తీరాన గద్దర్ విగ్రహం



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ప్రజాయుద్ధ నౌక గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం తలపెట్టింది. తెలంగాణ ఉద్యమంలో కీలకభూమిక పోషించిన కళాకారుల్లో గద్దర్ అగ్రభాగాన ఉన్న విషయం తెలిసిందే. విప్లవోద్యమం నుంచి ప్రజాఉద్యమంలోకి వచ్చిన గద్దర్ గురించి తెలియనివారు ఉండరు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం గద్దర్ పేరిటీ సినీ అవార్డులను ఏర్పాటుచేసి గౌరవించింది. అంతే కాకుండా ట్యాంక్ బండ్, హుస్సేన్ సాగర్ పరిసరాల్లో గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటుచేసి గౌరవించాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖకు మౌఖిక అదేశాలు జారీచేశారు. ప్రజాయుద్ధనౌక గద్దర్ విగ్రహం ఏర్పాటుకు అనువైన స్థలాల ఎంపికపై జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. దీనికి సంబంధించి ప్రాథమికంగా రెండు మూడు స్థలాలను ఎంపికచేయనున్నారు. వాటిలో ఒకదానిని ముఖ్యమంత్రి స్థాయిలో నిర్ణయం తీసుకుని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

## మతోన్మాద శక్తులను ఐక్యంగా తిప్పికొట్టాలి

- హిందూ ధర్మానికి, బీజేపీ చెబుతున్న హిందువులకు అసలు పొంతనలేదు.
- సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్
- సీపీఐ(ఎం) తెలంగాణ నాలుగో మహాసభ ప్రారంభోత్సవం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

'దేశవ్యాప్తంగా ఆదివారం 75వ రాజ్యాంగ దినోత్సవం జరుగుతుంది. స్వాతంత్ర్య పోరాట ఫలితంగా అంబేద్కర్ రాసిన రాజ్యాంగం జనవరి 26న అమల్లోకి వచ్చింది. ప్రజలందరి మదిలో రాజ్యాంగం ఉంది. కానీ, బిజెపి నాయకుల మనసులో రాజ్యాంగం లేదు. మనువాదం ఉంది. మనువాదానికి అనుగుణంగానే పాలన సాగిస్తున్నారు. అందులో భాగంగానే పార్లమెంటు సాక్షిగా అంబేద్కర్‌ను అవమానిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడారు. ఆయన మనసులో అదాని, గాడ్సే ఉన్నారు. అమిత్ షాకు కేంద్ర మంత్రిగా కొనసాగే అర్హత



లేదు. మంత్రి పదవికి తక్షణమే రాజీనామా చేయాలి' అని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో నాలుగు రోజులపాటు జరిగే సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభ శనివారం ప్రారంభమైంది. ఐబి కార్యాలయం నుంచి వేలాది మందితో భారీ ప్రజాప్రదర్శన నిర్వహించారు. అనంతరం పిఎస్ఆర్ గ్రౌండ్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, ఆహ్వాన సంఘం ఛైర్మన్ చుక్క రాములు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా బృందాకరత్ హాజరై ప్రసంగించారు. సీతారాం ఏచూరి స్ఫూర్తితో ఎర్ర జెండాను, ఉద్యమాలను ముందుకుతీసుకెళ్లేందుకు శపథం తీసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. మిగితా 2వ పేజీలో

# మార్చి వరకు లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ

- నేటి నుంచి 4 పథకాలు అమలు
- రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు
- సమీక్షించిన సీఎం రేవంత్ రెడ్డి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

గణతంత్ర దినోత్సవ శుభదినం జనవరి 26న ప్రజా ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకాలైన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పథకం అందేలా కార్యాచరణ ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నాలుగు ప్రతిష్ఠాత్మక సంక్షేమ పథకాలను లాంఛనంగా ప్రారంభిస్తున్న అంశంపై అందుబాటులో ఉన్న మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి గారు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సీఎంతో సమీక్షా సమావేశం తర్వాత మంత్రులు మీడియాకు ముఖ్యాంశాలు వెల్లడించారు.జనవరి 26న రాష్ట్రంలోని ప్రతి మండలంలో ఒక గ్రామంలో నూటికి నూరు శాతం అమలు చేయడం ద్వారా రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, కొత్త రేషన్ కార్డుల పంపిణీని లాంఛనంగా ప్రారంభిస్తారు. కొత్తగా లక్షల్లో దరఖాస్తులు వచ్చినందున జనవరి 26 నుంచి మార్చి వరకు లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది.

## 31న ఉస్మానియా ఆస్పత్రికి ముఖ్యమంత్రి శంకుస్థాపన

**రానున్న వందేళ్ల అవసరాలకు తగినట్లు పూర్తి ఆధునిక వసతులతో ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం ఉండాలి : సీఎం రేవంత్‌రెడ్డి**



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రానున్న వందేళ్ల అవసరాలకు తగినట్లు పూర్తి ఆధునిక వసతులతో ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఆసుపత్రి కొత్త భవనాల నిర్మాణానికి సంబంధించి ఏ విషయంలోనూ రాజీపడొద్దని అధికారులకు సూచించారు. గోషామహల్‌లో ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి ఈ నెల 31న ముఖ్యమంత్రి గారు శంకుస్థాపన చేయనున్నారు.ఉస్మానియా ఆసుపత్రి భవన నిర్మాణాలతో పాటు బోధన సిబ్బంది, విద్యార్థి, విద్యార్థినులకు వేర్వేరుగా నిర్మించే హాస్టల్ భవనాల విషయంలోనూ పూర్తి నిబంధనలు పాటించాలని చెప్పారు. ఆసుపత్రి నిర్మాణంపై మంత్రి దామోదర రాజనర్సింహ గారు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి గారు, ఇతర ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించి పలు సూచనలు చేశారు.

?? ఆసుపత్రి భవన నిర్మాణాలు, పార్కింగ్, ల్యాండ్ స్కేప్ విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలి. ఆసుపత్రికి రాకపోకలు సాగించేలా నలువైపులా రహదారులు ఉండాలి. అవసరమైన చోట ఇతర మార్గాలను కలిపేలా అండర్‌పాస్‌లు నిర్మించాలి.

?? ఆసుపత్రికి వచ్చే రోగులు, సహాయకులు, విజిటర్స్ వాహనాలు నిలిపేందుకు వీలుగా అండర్‌గ్రౌండ్‌లో రెండు ఫ్లోర్లలో పార్కింగ్ ఉండాలి. డార్మిటరీ, ఫైర్ స్టేషన్, క్యాంటిన్, మూత్రశాలలు, ఎస్టీపీలు నిర్మించాలి.

కొన్ని సందర్భాల్లో ముఖ్యంగా పిల్లలు విదేశాల్లో స్థిరపడిన వారు వచ్చేందుకు రెండు మూడు రోజులు పడుతోందని.. అప్పటి వరకు మృతదేహాలను భద్రపర్చేందుకు ఆధునిక సౌకర్యాలతో మార్చురీ, బాడీ ఫ్రీజింగ్ సదుపాయాలతో నిర్మాణాలు ఉండాలి.

?? అవయవాల మార్పిడి.. అత్యవసర సమయాల్లో రోగుల తరలింపునకు వీలుగా హెలీ అంబులెన్స్‌లు వినియోగిస్తున్నందున హెలీప్యాడ్ నిర్మాణం కూడా చేపట్టాలి. ఆసుపత్రిలో అడుగుపెట్టగానే ఆహ్లాదకర వాతావరణం ఉండేలా తీర్చిదిద్దాలి. ఆసుపత్రి భవన నిర్మాణాలకు సంబంధించిన నమూనాల్లో పలు మార్పులు చేర్పులను సూచించారు.

## రెండు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పాలక మండళ్ల నియామకం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రెండు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు రాష్ట్ర ప్రభుత్వం నూతన పాలక మండళ్లను నియమించింది. ఈ మేరకు ఖమ్మం జిల్లా మధిర, హైదరాబాద్ జిల్ల ఆబోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లకు నూతన ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసంది. తాజాగా నియమించిన రెండు పాలక మండళ్లతో కలిపి ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 148 అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలకు నూతన పాలకవర్గాన్ని నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైనా పాలకవర్గ సభ్యులకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు.



## పథకాల ప్రారంభోత్సవం పండుగలా నిర్వహించాలి

- ఒంటిగంటకు నాలుగు పథకాలు ప్రారంభం
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి
- కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాలుగు పథకాల ప్రారంభోత్సవానికి పండుగ వాతావరణంలో ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లను ఆదేశించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా.. ప్రారంభించనున్న కొత్త పథకాలపై జిల్లా కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం ఎంపిక చేసిన గ్రామాల్లో ఒంటిగంటకు నాలుగు పథకాలు ప్రారంభిస్తామని చెప్పారు. ఎంపిక చేసిన గ్రామాల్లో లబ్ధదారులకు నాలుగు పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారిని గ్రామానికి ఇన్‌ఛార్జ్‌గా నియమించాలని, ఒక్కో పథకానికి ఒక అధికారికి బాధ్యతలు అప్పగించాలని సీఎస్ తెలిపారు. లబ్ధిదారుల జాబితాను కలెక్టర్లు క్షుణ్ణంగా పరిశీలించి తుది నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రారంభ సమావేశాలకు అర్హులైన లబ్ధిదారులందరూ హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## నేడు మద్యం, మాంసం దుకాణాలు బంద్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

గణతంత్ర దినోత్సవం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో మందు, మాంసం దుకాణాలు మూతపడనున్నాయి. తిరిగి సోమవారం ఉదయం తెరుచుకుంటాయి. ఈ మేరకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు మద్యం, మాంసం విక్రయించే దుకాణదారులకు ఆదేశాలు జారీ చేశాయి. ఎవరైన ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించాయి. అన్ని పట్టణాల్లోనూ ఇవే ఆదేశాలు జారీ అయ్యాయి.

## జమిలి ఎన్నికలు దేశానికి అత్యవసరం

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 'ఒక దేశం ఒకే ఎన్నిక' (జమిలి ఎన్నికలు) ఆవశ్యకతను శనివారం ఉద్ఘాటించారు. పాలనలో నిలకడను పెంపొందించడం, విధాన స్తంభనను అడ్డుకోవడం, వనరుల మళ్లింపును నివారించడం, దేశంపై ఆర్థిక భారాలను తగ్గించడం ద్వారా దేశంలో 'సుపరిపాలన'ను పునర్నిర్వచించే అవకాశం దానికి ఉందని రాష్ట్రపతి అన్నారు. 76వ గణతంత్ర దినోత్సవానికి ముందు శనివారం జాతిని ఉద్దేశించి రాష్ట్రపతి ముర్ము ప్రసంగిస్తూ, 'దశాబ్దాలుగా దేశాన్ని పట్టి పీడించిన వలసవాద మనస్తత్వం ఆనవాళ్లను అంతం చేసేందుకు' ప్రభుత్వం సాగిస్తున్న కృషి గురించి ప్రధానంగా ప్రస్తావించారు. బ్రిటిష్ కాలం నాటి నేర చట్టాల స్థానే మూడు కొత్త ఆధునిక చట్టాలు ప్రవేశపెట్టడాన్ని ఆమె ఈ సందర్భంగా ఉటంకించారు. 'ఆ మనస్తత్వాన్ని మార్చేందుకు సంఘటితంగా జరుగుతున్న యత్నాలను మనం చూస్తున్నాం అటువంటి భారీ సంస్కరణలకు పట్టుదలతో కూడిన కృషి అవసరం' అని ఆమె అన్నారు. దేశవ్యాప్తంగా ఎన్నికల కార్యక్రమాల సమ్మిళితం లక్ష్యంగా ఉన్న ప్రతిపాదిత బిల్లు ప్రాముఖ్యాన్ని ముర్ము నొక్కిచెబుతూ,

'ఒక దేశం ఒకే ఎన్నిక ప్లాన్ ఇతోధిక పాలన, కుదించిన ఆర్థిక భారం సహా ఎన్నో ప్రయోజనాలను సమకూరుస్తుంది' అని తెలిపారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అభినియం ప్రవేశపెట్టడాన్ని ఆమె ప్రస్తావించారు. కేవలం శిక్ష విధించడం కన్నా న్యాయం చేకూర్చడానికి,



మహిళలు, పిల్లలపై నేరాల కట్టడికి గట్టి ప్రాధాన్యం ఇవ్వడానికి అవి ప్రాథమ్యం ఇస్తాయని ఆమె సూచించారు. రాజ్యాంగం ప్రాముఖ్యాన్ని ఉద్ఘాటించిన రాష్ట్రపతి గడచిన 75 ఏళ్లలో సాధించిన పురోగతిని ప్రస్తావించారు. 'స్వాతంత్ర్యం సిద్ధించిన సమయంలో దేశంలో అనేక ప్రాంతాలు తీవ్ర దారిద్ర్యం, ఆకలితో అలమటించాయి. అయితే, మనం ఆత్మ విశ్వాసంతో వ్యవహరించి వృద్ధికి పరిస్థితులు సృష్టించుకున్నాం' అని ఆమె చెప్పారు. రైతులు, కూలీల సేవలను ఆమె ప్రస్తావిస్తూ, భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు ప్రపంచ ఆర్థిక సరళుల్లో కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. ఈ పరివర్తన మూలాలు రాజ్యాంగం ఏర్పాటు చేసిన వ్యవస్థలో ఉన్నాయని ఆమె నొక్కిచెప్పారు. ఇటీవలి సంవత్సరాల్లో కొనసాగుతున్న అధిక ఆర్థిక వృద్ధి రేటు గురించి కూడా రాష్ట్రపతి ప్రస్తావించి, అది ఉద్యోగావకాశాలు కల్పించిందని, రైతులకు, కూలీలకు ఆదాయాన్ని పెంచిందని,

అనేక మందిని దారిద్ర్యం నుంచి బయటకు తెచ్చిందని తెలియజేశారు. బడుగు వర్గాల, ముఖ్యంగా ఎస్‌సిలు, ఎస్‌టిలు, ఒబిసిలకు మిగితా 2వ పేజీలో

## ఇందిరమ్మ పేరు పెడితే ఒక్క ఇల్లు ఇవ్వం

- కాంగ్రెస్ ఫొటోలు పెడితే రేషన్ కార్డులు కూడా ఇవ్వం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. నిరుపేదలకు ఇస్తున్న ఇండ్ల పథకానికి ఇందిరమ్మ పేరు పెడితే కేంద్ర ప్రభుత్వం ఒక్క ఇల్లు కూడా ఇవ్వబోదని బండి సంజయ్ అన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పేరు పెడితేనే నిధులు ఇస్తామని చెప్పుకొచ్చారు. అంతేకాకుండా.. కొత్తగా జారీ చేస్తున్న రేషన్ కార్డులపై కాంగ్రెస్ ఫొటోలు పెడితే కూడా.. ఆ రేషన్ కార్డులు కూడా ఇవ్వబోమన్నారు. తామే స్వయంగా ముద్రించి ప్రజలకు రేషన్ కార్డులు ఇస్తామని బండి సంజయ్ పేర్కొన్నారు. . కరీంనగర్‌లో శనివారం బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుంటే రేషన్ బియ్యంపై ప్రధాని ఫొటో ఎందుకు పెట్టడం లేదని బండి సంజయ్ ప్రశ్నించారు. ఇకపై కొత్త రేషన్ కార్డులపై ముఖ్యమంత్రితో



పాటు ప్రధానమంత్రి ఫొటో కూడా పెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఉచిత బియ్యం ఎందుకు సరఫరా చేయాలని ప్రశ్నించారు. అవసరమైతే కేంద్రమే నేరుగా పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేసే విషయాన్ని ఆలోచిస్తామని అన్నారు. తామే ముద్రించి ప్రజలకు రేషన్ కార్డులు ఇస్తామని వ్యాఖ్యానించారు.

దావోస్ వేదికగా లక్షల కోట్ల రూపాయల పెట్టబడులపై ఎంవోయూలు జరిగాయంటూ జరుగుతున్న కాంగ్రెస్ చేస్తున్న ప్రచారమంతా హంబక్ అనికొట్టిపారేశారు. దావోస్ మిగితా 2వ పేజీలో

# ఓటు హక్కును వినియోగించుకోవాలి

## రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదని, ప్రతి పౌరుడు ఓటు హక్కును వినియోగించుకొని దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని రాష్ట్ర గవర్నర్ గౌ. జిష్ణు దేవ్ వర్మ పిలుపునిచ్చారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో నేషనల్ ఓటర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ముందుగా పోలీసు వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 25న దేశవ్యాప్తంగా జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఎన్నికల నిర్వహణలో ఓటరు జాబితా అత్యంత ప్రధానమైనదని పేర్కొన్నారు. మనది ప్రజాస్వామ్య దేశమని, తెలంగాణలో అందరి సహకారంతో సాఫీగా స్వేచ్ఛగా ఎన్నికలు జరిగాయన్నారు. ఎన్నికల కమిషన్ ఓటరు నమోదు ప్రక్రియను సులభతరం చేయడం జరిగిందని తెలిపారు. యువత ఓటు హక్కు ప్రాముఖ్యతను గుర్తించి, ఎన్నికల ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొని ఓటు హక్కు వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని ఆయన సూచించారు. డెబ్బై ఐదు సంవత్సరాల క్రితం, మన రాజ్యాంగ నిర్మాతలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ఎన్నికలను నిర్వహించడం, పర్యవేక్షించాలన్న లక్ష్యంతో భారత ఎన్నికల కమిషన్ (ఇసీఐ)ను బలమైన, స్వతంత్ర సంస్థగా ఏర్పాటు చేశారని తెలిపారు.




ఓటర్ల నమోదు పెంచడానికి భారత ఎన్నికల కమిషన్ పలు చర్యలు ప్రవేశపెట్టిందన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కోసం ముందుగానే దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల అధికారి (సీఈఓ) సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు ఎంత ముఖ్యమో వివరించి, అందరికీ జాతీయ ఓటర్ల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది నేషనల్ ఓటర్స్ డే థీమ్ 'ఓటును మించినది ఏమీ లేదు – నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను' అని తెలిపారు. ప్రతి పౌరుడు ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ చేతుల మీదుగా నూతనంగా ఓటు హక్కు పొందిన యువ ఓటర్లకు ఎలక్టోరల్ ఫోటో ఐడెంటిటీ కార్డులు అందజేశారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆయా జిల్లా కలెక్టర్లకు, అధికారులకు, బూత్ స్థాయి అధికారులకు అవార్డులు అందజేశారు. క్విజ్ కాంపిటీషన్, వ్యాసరచన పోటీలలో రాష్ట్రస్థాయిలో విజేతలైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బందికి మెమోంటో, అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని, అడిషనల్ సీఈవో లోకేష్ కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, డిప్యూటీ సీఈఓలు సత్యవాణి, హరి సింగ్, అడిషనల్ కమిషనర్ అలివేలు మంగతాయారు, చీఫ్ వెటర్నరీ అధికారి డా.అబ్దుల్ వకీల్, డీసీలు రజినీకాంత్ రెడ్డి, ప్రశాంతి, అధికారులు, సీఈఓ కార్యాలయ అధికారులు, విద్యార్థులు, ఎన్.సీ.సీ విద్యార్థులు, యువత, వివిధ వర్గాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు వార్తలను ప్రచారం చేయకండి

## ● దిల్ రాజు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



వరుస సినిమాలు చేస్తూ.. అత్యంత విజయవంతమైన నిర్మాతగా పేరొందిన దిల్ రాజుపై ఐటీ సోదాలు వరుసగా నాలుగు రోజుల పాటు జరగడం తెలుగు రాష్ట్రాలతోపాటు సినీ పరిశ్రమలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ దాడుల సమయంలో దిల్ రాజు అంశంపై విస్తృతంగా వార్తలు వచ్చాయి. నాలుగు రోజుల తర్వాత ఐటీ దాడులు ముగియడంతో ఆయన మీడియాతో మాట్లాడారు.

'నాలుగురోజులుగా ఐటీదాడులు మా నివాసాల్లోనూ .. ఆఫీస్‌లోనూ జరిగాయి. కొన్ని ఛానెల్స్.. సోషల్ మీడియాలో మా వద్ద డబ్బులు, డాక్యుమెంట్స్ దొరికాయని వార్తలు వేశారు. కానీ రూ.20 లక్షల లోపు మాత్రమే ఉన్నాయి' అని దిల్ రాజు ప్రకటించారు. ఐదు సంవత్సరాల నుంచి తాము ఎక్కడా ఇన్వెస్ట్ చేయలేదని ప్రకటించారు. '24 క్రాఫ్ట్స్‌లో లావాదేవిల డీటైల్స్ తీసుకున్నారు. ఫైనల్‌గా నా వద్ద డాక్యుమెంట్స్ పరిశీలించారు. అంతా పక్కాగా ఉండడంతో ఐటీ అధికారులే ఆశ్చర్యపోయారు' అని వివరణ ఇచ్చారు. 'మా అమ్మకు లంగ్ ఇన్ఫెక్షన్ వల్ల చికిత్స తీసుకున్నారు. దయచేసి మామీద తప్పుడు వార్తలు వేయవద్దు' అని దిల్ రాజు విజ్ఞప్తి చేశారు. 'నేనేమి టార్గెట్ అవ్వలేదు. మా మీద ఐటీ సోదాలు జరిగి 18 ఏళ్లు అయింది. ఇదంతా ఒక ప్రక్రియ. ఎక్కువగా ఊహించుకోవద్దు.. ఎలాంటి హడావుడి లేదు' అని దిల్ రాజు స్పష్టం చేశారు. 'సినీ పరిశ్రమలో అంతా ఆన్‌లైనలో బుకింగ్ .. ఆన్‌లైన్ లావాదేవీలు జరుగుతున్నాయి. ఇండస్ట్రీ అంతటా రైడ్స్ జరిగాయి' అని గుర్తుచేశారు.

సినిమా కలెక్షన్స్ లెక్కల విషయమై దిల్ రాజు కీలక వ్యాఖ్యలు చేశారు. 'కలెక్షన్స్ ఎక్కువ చేసి చూపించడం మీద ఇండస్ట్రీ అంతా కూర్చొని మాట్లాడతాం. అది తప్పు.. తీరు మార్చుకోవాల్సిందే' అని పేర్కొన్నారు. 'ఫిబ్రవరి 3వ తేదీన ఐటీ అధికారులు కలవమన్నారు.. ఆ రోజు ఆడిటర్స్ వెళ్లి కలుస్తారు' అని దిల్ రాజు చెప్పారు.ఐటీ దాడులు జరుగుతున్న క్రమంలో నేను అధికారులతో ఉండగా.. ఈ నెల 19న అమ్మకి దగ్గు, జలుబు ఎక్కువయ్యి ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది ఉండడంతో ఆసుపత్రికి వెళ్లి ట్రిట్‌మెంట్ తీసుకొని ఇంటికి వచ్చింది. అయితే ఇంటికి వచ్చిన అనంతరం సడన్‌గా దగ్గు ఎక్కువ అవ్వడంతో మళ్లీ వెంటనే ఆసుపత్రికి తరలించాం. కానీ ఈ విషయంలో కొన్ని మీడియా ఛానల్స్ ఆమెకి హార్ట్ ఎటాక్ అని.. ఇంకేదో అని రాశారు. అవేం లేవు. ఆమె ప్రస్తుతం బాగానే ఉంది. ప్రస్తుతం ఆమె వయస్సు 81 ఏండ్లు. రెండు రోజులు ఆసుపత్రిలో ఉంది. ఇప్పుడు డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వస్తున్నారు. లంగ్స్ ఇన్ఫెక్షన్ పెరగడం వలన దగ్గు ఎక్కువ అయ్యింది తప్ప ఇంకేం కాలేదు. మీడియాకు ఒక్కటే విజ్ఞప్తి చేస్తున్న తప్పుడు వార్తలను ప్రచారం చేయకండి అంటూ దిల్ రాజు తెలిపాడు.

## జమిలి ఎన్నికలు దేశానికి అత్యవసరం

(మొదటి పేజీ తరువాయి)

చెందినవారికి అండగా నిలిచేందుకు జరుగుతున్న కృషిని కూడా ముర్ము వక్కాణించారు, సమ్మిళిత వృద్ధి, దేశంలో పాలన ప్రమాణాల పునర్నిర్వచించడం, పౌరులు అందరికీ మరింత సమాన, సౌభాగ్య భవిష్యత్ కల్పన పట్ల ప్రభుత్వ నిబద్ధతను రాష్ట్రపతి ప్రసంగం ప్రధానంగా ప్రస్తావించింది. ఈ సందర్భం పౌరులు అందరి ఆనందాన్ని, గర్వాన్ని కలసి వేడుకగా జరుపుకునేదిగా ఆమె పేర్కొన్నారు. ఒక దేశ జీవితంలో 75 ఏళ్లు స్వల్ప మాత్రమే కావచ్చు కానీ భారత్‌కు అది చెప్పుకోదగిన కాలం అని ముర్ము అన్నారు. భారత చారిత్రక ప్రస్థానాన్ని ఆమె తిరిగి ప్రతిబింబిస్తూ, దేశ స్వేచ్ఛ కోసం తమ ప్రాణాలు త్యాగం చేసిన సాహస యోధులను గుర్తు ఉంచుకోవలసిందిగా పౌరులకు విజ్ఞప్తి చేశారు. ఆమె ఈ సందర్భంగా భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి గురించి ప్రస్తావిస్తూ, స్వాతంత్ర్యోద్యమానికి ఆయన చేసిన కృషి ఇప్పుడు సముచిత గుర్తింపు పొందుతోందని చెప్పారు. పకడ్బందీగా సాగిన స్వాతంత్ర్యోద్యమంలో దేశాన్ని సంఘటితపరచిన 20వ శతాబ్దపు సమరయోధులను రాష్ట్రపతి శ్లాఘించారు.

భారత్ తన ప్రజాస్వామిక విలువలను తిరిగి కనుగొనడంలో తోడ్పడినందుకు మహాత్మా గాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్. బాబా సాహెబ్ అంబేద్కర్ వంటి దిగ్గజాలకు ఆ ఖ్యాతి దక్కుతుందని ముర్ము అన్నారు. రాజ్యాంగ సభ సమ్మిళిత స్వభావాన్ని ముర్ము నొక్కిచెబుతూ, 15 మంది మహిళా సభ్యులతో సహా దేశవ్యాప్తంగా వివిధ వర్గాలకు అది ప్రాతినిధ్యం వహించిందని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ రూపకల్పనలో వారు కీలక పాత్ర పోషించారని తెలిపారు. మహిళల సమానత్వం ప్రపంచంలో అనేక ప్రాంతాల్లో సుదూర గమ్యంగా ఉన్న సమయంలో భారతీయ మహిళలు దేశ భవిత నిర్ణయంలో నిమగ్నమయ్యారని రాష్ట్రపతి తెలిపారు.

## ఇందిరమ్మ పేరు పెడితే ఒక్క ఇల్లు ఇవ్వం

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడులకు సంబంధించి ఎంత మొత్తంలో ఎంవోయూలు జరిగాయి? ఎంత మందికి ఉద్యోగాలిస్తామన్నారనే విషయాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల దృష్టిని మరల్చిందుకే దావోస్ పెట్టుబడుల జాతర పేరుతో ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించకపోవడంతో పేదలకు వైద్యం అందక చస్తున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. పెండింగ్ బిల్లులు రాక మాజీ సర్పంచులు ఆత్మహత్య చేసుకుంటున్నా స్పందించడం లేదని అన్నారు.

**రేవంత్ రెడ్డికి గురువు**
**కేసీఆరేనని**

బండి సంజయ్ ఆరోపించారు. గతంలో పదేళ్ల పాటు కేసీఆర్ ఏం చేశారో.. రేవంత్ రెడ్డి ఇప్పుడు కూడా అదే చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి పనిలో కొత్తదనం ఏమీ లేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు ఏమైందని.. కాళేశ్వరం అవినీతి ఎక్కడకు పోయిందని.. కేసీఆర్‌ను జైల్లో ఎందుకు వేయడం లేదని ప్రభుత్వాన్ని బండి సంజయ్ నిలదీశారు. మరోవైపు.. ఫార్ములా కారు రేసు కేసులో కేటీఆర్‌ను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని కూడా ప్రశ్నించారు. దావోస్‌కు రెండుసార్లు పోయినా.. పెట్టుబడులపై స్పష్టత లేదని బండి సంజయ్ ఆరోపిస్తూ.. శ్వేత పత్రం విడుదల చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

## 139 మందికి పద్మ పురస్కారాలు

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. భారత అథ్లెట్లకు కేంద్ర ప్రభుత్వం తాజాగా పద్మ అవార్డులు ప్రకటించింది. ఇందులో టీమ్‌ఇండియా మాజీ హాకీ ప్లేయర్, ఒలింపిక్ మెడలిస్ట్ పీ ఆర్ శ్రీజేశ్‌కు పద్మ భూషణ్ అవార్డు దక్కగా, మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్‌కు పద్మ శ్రీ పురస్కారం లభించింది.వీళ్లతోపాటు లెజెండరీ భారత ఫుట్‌బాల్ క్రీడాకారుడు ఐ ఎం విజయన్, భారత మొట్టమొదటి పారాలింపిక్ బంగారు పతక విజేత ఆర్చర్ హర్విందర్ సింగ్ కూడా అత్యున్నత పద్మశ్రీ అవార్డుకు ఎంపికయ్యారు.

## మతోన్మాద శక్తులను ఐక్యంగా తిప్పికొట్టాలి

(మొదటి పేజీ తరువాయి)



దేశంలో కార్మికులు, రైతులు దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. మోడీ ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతోందని, కార్పొరేట్లకు మాత్రం రూ.మూడు లక్షల కోట్లు రాయితీలు ఇచ్చిందని వివరించారు. ప్రజల మధ్య కులం, మతం పేరుతో చిచ్చు పెట్టి రెచ్చగొడుతోందని, ఇది దేశానికే ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ధర్మానికి, ప్రజల మత విశ్వాసాలకు, హిందూత్వ భావజాలానికి సంబంధమే లేదన్నారు. మతాన్ని ఆయుధంగా రాజకీయాలకు వాడుకోవడం సరికాని తెలిపారు. దీన్ని వ్యతిరేకించడం కోసం ఇండియా వేదిక ఏర్పడిందన్నారు. ఇండియా వేదిక అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు ఆదర్శంగా ఉండాలని సూచించారు.

ట్రంప్, మోడీ, రేవంత్‌రెడ్డిలకు సంపన్నులే దోస్తులని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. వారికి పేదల బాధలు పట్టవని తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో అనేక పార్టీలను, ప్రభుత్వాలను చూశామని, ఆ పార్టీల వంటిది సిపిఎం కాదని వివరించారు. దేశంలోని మార్కెటింగ్ వ్యవస్థను అంబాని, అదానిలకు కట్టబెట్టే పనిలో మోడీ సర్కారు ఉందని తెలిపారు. బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్, టిడిపి, వైసిపిలు సంపన్నుల కోసం పనిచేసే పార్టీలన్నారు. ప్రజాస్వామ్యం ఉంటేనే కష్టజీవులకు హక్కులు ఉంటాయని తెలిపారు. అందరినీ సమానంగా చూడాలని రాజ్యాంగం చెబితే, మోడీ సర్కారు దాన్ని భగం చేస్తోందని వివరించారు. కేంద్రం పన్నుల్లో రాష్ట్రాలకు 50 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జమిలి ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధమన్నారు. ప్రజాస్వామ్యాన్ని, ఫెడరలిజాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపైనా ఉందని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ బిజెపి దేశానికే కాకుండా తెలంగాణకూ ప్రమాదకరమైన పార్టీ అని అన్నారు. బిజెపి విధానాలను, కుయుక్తులను అడ్డుకుంటామని, మతోన్మాదాన్ని తిప్పికొడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఆర్ అరుణ్‌కుమార్, బి వెంకట్, జి నాగయ్య, సిపిఎం నేతలు వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, ఎం సాయిబాబు, టి జ్యోతి, పోతినేని సుదర్శన్, డిజి నరసింహారావు, జాన్‌వెస్లీ, పాలడుగు భాస్కర్, మల్లు లక్ష్మి, టి సాగర్, పి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు 4 పథకాలు ప్రారంభం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

సీఎం రేవంత్‌రెడ్డితో సమీక్ష అనంతరం మంత్రులు మీడియాకు వివరాలు వెల్లడించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ గ్రామసభలు నిర్వహించి అర్హత కలిగిన లబ్ధిదారుల వద్ద దరఖాస్తులు స్వీకరించామన్నారు. రాష్ట్రంలో 4 కొత్త పథకాలు ప్రారంభిస్తామని మరోసారి స్పష్టం చేశారు. రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పథకాలు ప్రారంభిస్తామన్నారు. అర్హులైన లబ్ధిదారులందరికీ పథకాలు ఇస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. వ్యవసాయయోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా అందిస్తామన్నారు. రేషన్ కార్డుల విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మనిషికి ఆరు కిలోల సన్న బియ్యం అందిస్తామని పేర్కొన్నారు. రేపు మండలానికి ఒక గ్రామంలో సంక్షేమ పథకాలు ప్రారంభిస్తామని వివరించారు.

మండలానికి ఒక గ్రామంలో సంక్షేమ పథకాలు ప్రారంభిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందజేస్తామని చెప్పారు. ఎంపిక చేసిన గ్రామాల్లో మధ్యాహ్నం ఒంటి గంటకు 4 పథకాలు ప్రారంభిస్తామన్నారు. ఇచ్చిన రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. ఇది ప్రజల ప్రభుత్వం, పేదల ప్రభుత్వమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ 4 పథకాలు ఇస్తున్నామన్నారు. ప్రతి కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో చేస్తామని మంత్రి చెప్పారు.

# రౌడీ షీట్స్ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు..

- రౌడీ షీటర్స్,హిస్టరీ షీటర్స్, సస్పెక్ట్స్ లపై నిరంతర పర్యవేక్షణ
- పాత నేరస్తులు సత్ప్రవర్తనతో జీవితాలను సరిదిద్దుకోవాలి...
- ఎస్పీ అఖిల్ మహాజన్.



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

రౌడీ,హిస్టరీ షీట్స్ ఉన్నవారిపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.శనివారం సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్లో సిరిసిల్ల సబ్ డివిజన్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలోని వివిధ రకాల నేరాల్లో నిందితులుగా ఉండి రౌడీ షీట్లు,హిస్టరీ షీట్లు , సస్పెక్ట్స్ గా ఉన్న వ్యక్తులకు ఎస్పీ అఖిల్ మహాజన్ కౌన్సిలింగ్ నిర్వహించారు.


ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ వివిధ పోలీస్ స్టేషన్లలో నేరాల్లో నిందితులుగా ఉండి షీట్లు తెరువబడిన నేరచరితులు విధిగా పోలీసు వారు తెలిపిన సమయాల్లో పోలీస్ స్టేషన్ హాజరు కావాలని లేని పక్షంలో వారిని బైండోవర్ చేయడం జరుగుతుందని అన్నారు. హెచ్చరించారు. నేరాలకు దూరంగా ఉండటంతో పాటు సత్ప్రవర్తనతో మెదులుతున్న వారిని గుర్తించి వారిపై ఉన్న షీట్స్ ను తొలగించడం జరుగుతుందని అన్నారు . రౌడీ, హిస్టరీ అనుమానాస్పద,అల్లర్లు లో ప్రమేయం ఉన్నవారిని ప్రతి నెల పోలీస్ స్టేషన్ కు పిలిపించి వివరాలు సేకరిస్తున్నామని అన్నారు.అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపడం జరుగుతుందని శాంతియుత వాతావరణానికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు .ఈ కార్యక్రమంలో డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిఐ లు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, రామ్మోహన్, శ్రీకాంత్,రమాకాంత్, గణేష్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు...

# అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడిగా యూసుఫ్ ఏయూసుబ్ తొలగింపు

- ఉత్తర్వులు జారీ చేసిన ఐ అండ్ పీ.ఆర్ కమిషనర్..

**బలగం టీవీ , సిరిసిల్ల**

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ నుంచి సిఫార్సు చేయబడిన, రాజన్న సిరిసిల్ల జిల్లా అక్రిడిటేషన్ కమిటీ (2022-2024) సభ్యుడిగా ఉన్న యూసఫ్ అలియాస్ యూసూబ్ ను తొలగిస్తూ ఐ అండ్ పీ.ఆర్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడిగా ఉన్న యూసఫ్ అలియాస్ యూసూబ్ పై పలు ఆరోపణలు, ఫిర్యాదులు, కేసులు నమోదుకాగా, పోలీసులు విచారణ చేపట్టి పూర్తి వివరాలు ఐ అండ్ పీ.ఆర్ కమిషనర్ కు పంపించారు. దీంతో జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడిగా ఉన్న యూసఫ్ అలియాస్ యూసూబ్ ను తొలగిస్తూ ఐ అండ్ పీ ఆర్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.



# గౌడ జన హక్కుల పోరాట సమితి క్యాలెండర్ ఆవిష్కరణ..

**బలగం టీవీ ,సిరిసిల్ల**

గౌడ జన హక్కుల పోరాట సమితి క్యాలెండర్ ను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్,రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మరియు తెలంగాణ పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఎలికట్ట విధి విజయకుమార్ గౌడ్ మాట్లాడుతూ గౌడ కార్మికుల సంక్షేమం, గీత కార్మికుల సమస్యలు, గౌడులు ఎదుర్కొంటున్న పలు అంశాలపై వినతి పత్రాలు అందజేయడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గుర్రం దేవేందర్ గౌడ్, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు పూదరి రాజు గౌడ్, రాష్ట్ర నాయకులు చంద్రం దుర్గా గౌడ్ వివిధ జిల్లాల అధ్యక్షులు నాయకులు గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు వినియోగించుకోవడం అందరి బాధ్యత...

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా..



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

ఓటు హక్కు వినియోగించుకోవడం అందరి బాధ్యత కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు . శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ షుర్ అనే థీమ్ తో 15వ జాతీయ ఓటర్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఉద్యోగులు లిభారతదేశ పౌరులమయిన మేము, ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, మనదేశ ప్రజాస్వామ్య సాంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతామనీ, మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ప్రతీ ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని ఇందు మూలంగా ప్రతిజ్ఞ చేస్తున్నామని ప్రతిజ్ఞ చేశారు.

అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఓటర్ నమోదు పెంపు, ఎథికల్ ఓటింగ్ పై అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటర్ దినోత్సవంగా వేడుకలు నిర్వహిస్తామని, ఈ సంవత్సరం నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ షుర్ అనే థీమ్ తో వేడుకలు జరుగుతున్నాయని అన్నారు .



**విద్యార్థులకు బహుమతులు**

జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా పలు విద్యా సంస్థల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా , అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పంపిణీ చేశారు. వ్యాస రచన పోటీల్లో ఈ చైతన్య, కే నికిత, జీ హరిక, సీహెచ్ రోహిత్, సాయి కృష్ణ, కే రాం చరణ్, ఈ ప్రేమ్ కుమార్ విజేతలుగా నిలువగా, బహుమతులు అందజేసి, అభినందించారు.

**సీనియర్ ఓటర్లకు సన్మానం..**

ఎక్కువ సార్లు ఓటు హక్కు వినియోగించుకున్న ఎలగందుల బుచ్చయ్య, రదేంశ్ భారతి, అలాగే ట్రాన్స్ జెండర్ కౌసల్యను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ శాలువాతో సన్మానించారు.

**నూతన ఓటర్లకు కార్డుల అందజేత..**

నూతనంగా ఓటరు గా నమోదు అయిన సుద్దాల హర్షవర్ధన్, సుంకనపల్లి స్వాతి, జక్కని ధనుష్, దూడం అఖిల, తోట ప్రసన్నాంభిక కు నూతన ఎపిక్ కార్డులు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అందజేసి, అభినందించారు. కార్యక్రమాల్లో జడ్పీ సీఈవో వినోద్, ఎస్డీసీ, సిరిసిల్ల ఇన్చార్జి ఆర్డీవో రాధా భాయ్ ఆయా శాఖల ఉన్నతాధికారులు, ఉద్యోగులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**సిరిసిల్లలో ర్యాలీ..**

జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కు వినియోగం పై అవగాహన కల్పించారు. ముందుగా ప్రతిజ్ఞ చేశారు. ర్యాలీలో ఎస్డీసీ, సిరిసిల్ల ఇన్చార్జి ఆర్డీవో రాధా భాయ్, తహసిల్దార్ ఉమారాణి, అధికారులు, సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు

# ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం...

- ఎస్పీ అఖిల్ మహాజన్

**బలగం టీవీ, సిరిసిల్ల**

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధమని,ఓటు హక్కును వినియోగించుకోవడం మన అందరి బాధ్యత అని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్ అధికారులు,సిబ్బందితో కలసి ప్రతిజ్ఞ చేశారు.ఈసందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ దేశంలో18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని,ప్రతి ఎన్నికలలో తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని,ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా రాజ్యాంగ స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయవచ్చున్నారు. ప్రపంచ దేశాలలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగం కలిగిన భారతదేశంలో ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరికి తెలియజేయాల్సిన బాధ్యత పౌరులుగా మనందరి పైనా ఉన్నదన్నారు. ప్రజలను చైతన్యం చేయడం, వారికి ఓటు



విలువ గురించి అవగాహన కల్పించడం ద్వారా ప్రజలంతా ఓటర్లుగా నమోదు చేసుకునేలా కృషి చేయాలని అన్నారు .ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ మురళి కృష్ణ, ఆర్ఐ లు మధుకర్, రమేష్,సిఐ మధుకర్,ఎస్ఐ లు,పోలీస్ కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# డీజే టిల్లు పాటకు స్టెప్పులేసిన మంత్రి సీతక్క..



**బలగం టీవీ , ములుగు**

నిత్యం ప్రభుత్వ కార్యక్రమాలతో బిజీగా ఉండే మంత్రి సీతక్క.. విద్యార్థులతో కలిసి సరదాగా గడిపారు. విద్యార్థులతో కలిసి డీజే టిల్లు పాటకు మంత్రి సీతక్క స్టెప్పులేసి అందర్నీ ఆశ్చర్యపరిచారు. ఆమె డ్యాన్స్ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ములుగులో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. యువతీయువకులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించడానికి 3కే రన్ నిర్వహించారు. ఈ రన్ ప్రారంభానికి ముందు సీతక్క డీజే టిల్లు పాటకు డ్యాన్స్ చేశారు. అక్కడున్న యువతీ యువకుల్లో ఆమె జోష్ నింపారు. సీతక్క డ్యాన్స్‌కు ఫిదా అయిన యువకులు ఈలలు, చప్పట్లతో అభినందించారు.

ఇదిలా ఉంటే.. ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు ఉద్దేశపూర్వకంగా తప్పుచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సస్పెన్షన్‌తోపాటు సర్వీస్ నుంచి రిమూవ్ చేస్తామని హెచ్చరించారు. కొందరు అధికారులు అనాలోచితంగా వ్యవహరిస్తున్నారని, స్కీముల అమలులో విచక్షణ, మానవత్వం మరవొద్దని చెప్పారు. మంచిర్యాలలో ఓ వృద్ధురాలికి పింఛన్ ఆపడంపై ఫైర్ అయ్యారు. ఇష్టారీతిన నిర్ణయాలు తీసుకొని ప్రభుత్వం మీద రుద్దితే కఠినంగా శిక్షిస్తామన్నారు.

# చెపాక్‌లో తెలుగోడి షో

- చెలరేగిన తిలక్ వర్మ
- రెండో టీ20లోనూ

భారత్ గెలుపు

బలగం టీవి, చెన్నై

ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో భారత్ వరుసగా రెండో విజయం నమోదు చేసింది. చెన్నై వేదికగా శనివారం జరిగిన రెండో మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 2 వికెట్ల తేడాతో నెగ్గింది. ఇంగ్లాండ్ నిర్దేశించిన 166 పరుగుల లక్ష్యాన్ని భారత్ 19.2 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి ఛేదించింది. తెలుగు కుర్రాడు తిలక్





వర్మ (72 పరుగులు) అద్భుత హాఫ్ సెంచరీతో అదరగొట్టాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో కార్స్ 3, మార్క్ వుడ్, ఆదిల్ రషీద్, ఓవర్టన్, లివింగ్‌స్టోన్, ఆర్చర్ తలో వికెట్ పడగొట్టారు. సూపర్ హాఫ్ సెంచరీతో భారత్‌ను విజయతీరాలకు చేర్చిన తిలక్ వర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

అంతకుముందు బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ నిర్ణీత 20 ఓవర్లో 165-9 పరుగులు చేసింది. జోస్ బట్లర్ (45 పరుగులు 30 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్. బ్రైడన్ కార్సే (31 పరుగులుబీ 17 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు), జేమీ స్మిత్ (22 పరుగులుబీ 12 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడారు. ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (4 పరుగులు), బెన్ డకెట్ (4 పరుగులు) సింగిల్ డిజిట్ స్కోరుకే పెవిలియన్ చేరారు. హ్యారీ బ్రూక్ (13 పరుగులు), లివింగ్‌స్టన్ (13 పరుగులు) విఫలమయ్యారు. భారత బౌలర్లలో అక్షర్ పటేల్ 2, వరుణ్ చక్రవర్తి 2, అర్ష్‌దీప్ సింగ్, హార్దిక్, వాషింగ్టన్ సుందర్, అభిషేక్ శర్మ తలో వికెట్ సాధించారు.కాగా, తాజా విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో టీమ్‌ఇండియా 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఇరుజట్ల మధ్య మూడో టీ20 మంగళవారం జరగనుంది. ఈ మ్యాచ్‌కు రాజ్‌కోట్ వేదిక కానుంది.



### ఆస్ట్రేలియన్ ఓపెన్

## ఛాంపియన్‌గా మాడిసన్ కీస్

బలగం టీవి, హైదరాబాద్

2025 ఆస్ట్రేలియా ఓపెన్‌లో బెలారస్ టెన్నిస్ స్టార్ సబలెంకకు షాక్ తగిలింది. ˘నివారం జరిగిన మహి ళల సింగిల్స్ ఫైనల్‌లో ఆమె ఓడింది. టైటిల్ పోరులో సబలెంకను ఢీ కొట్టిన అమెరికా అమ్మాయి మాడిసన్ కీస్ ఛాంపియన్‌గా నిలిచింది. హెూరాహెూరీగా సాగిన ఈ పోరులో 6-3, 2-6, 7-5 తేడాతో సబలెంకను మట్టికరిపించిన మాడిసన్ కీస్ కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించింది.



## జమ్మూకశ్మీర్ గెలుపు

బలగం టీవి, హైదరాబాద్

డిఫెండింగ్ చాంపియన్ ముంబై జట్టు.. రంజీ టోర్నీ గ్రూపు ఏ మ్యాచ్‌లో జమ్మూకశ్మీర్ చేతిలో ఓటమి పాలైంది. 5 వికెట్ల తేడాతో జమ్మూకశ్మీర్ జట్టు విజయం నమోదు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో 205 రన్స్ టార్గెట్‌తో బరిలోకి దిగిన జమ్మూకశ్మీర్ ఓ దశలో 159 రన్స్‌కే అయిదు వికెట్లు కోల్పోయింది. కానీ ఆరో వికెట్‌కు అబిద్ ముస్తాక్, కన్హయ్య వద్వాన్ అజేయంగా 46 రన్స్ జోడించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ముంబై బౌలర్ షామ్స్ ములానీ నాలుగు వికెట్లు తీసుకున్నాడు.




## కానిస్టేబుల్ టైటిల్ సాంగ్ విడుదల చేసిన కమిషనర్

బలగం టీవి, హైదరాబాద్

వరుణ్ సందేశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం కానిస్టేబుల్. ఈ సినిమాకు ఆర్యన్ సుభాన్ దర్శకత్వం వహిస్తుండగా.. జాగృతి మూవీ మేకర్స్ పతాకంపై బలగం జగదీష్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి కానిస్టేబుల్ ప్రమోషనల్ సాంగ్‌ను హైదరాబాద్ కమిషనర్ సీవి ఆనంద్ చేతుల మీదుగా చిత్రబృందం లాంఛ్ చేయించింది. కానిస్టేబుల్ అన్నా అనే టైటిల్‌తో వచ్చిన ఈ పాట కానిస్టేబుళ్ల కృషి, అంకితభావం, త్యాగాలకు గుర్తుకుతెస్తుందని చిత్రబృందం వెల్లడించింది. ఈ సాంగ్ విన్న హైదరాబాద్ కమిషనర్ సినిమా విజయం సాధించాలని చిత్రబృందానికి విషెస్ తెలిపారు. సుభాష్ ఆనంద్ సంగీతం అందించిన ఈ పాటను నల్గొండ గద్దర్ నర్సన్న పాడారు.

## సింహాన్ని లాక్ చేసిన రాజమౌళి

బలగం టీవి, హైదరాబాద్

ఎస్.ఎస్ రాజమౌళి, మహేశ్ బాబు కాంబోలో ఒక సినిమా రానున్న విషయం తెలిసిందే. ఇప్పటికే పూజ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం ప్రీ ప్రోడక్షన్ పనులు జరుపుకుంటుంది. ఈ నేపథ్యంలో ఒక వీడియోను విడుదల చేశారు రాజమౌళి. ఈ వీడియోలో సింహాన్ని ఎటు వెళ్లకుండా బోన్‌లో లాక్ చేసినట్టు చూపించారు. అంతేకాకుండా రాజమౌళి పాస్‌పోర్ట్ చూపించారు. దీనికి 'క్యాప్చ ర్' అనే క్యాప్షన్ పెట్టారు. అయితే ఈ వీడియోతొ తాజాగా ఈ మూవీ పట్టాలెక్కబోతున్నట్లు తెలుస్తుంది. ఈ వీడియోపై మహేశ్ బాబు , ప్రియాంక చోప్రా స్పందించారు. మహేశ్ బాబు స్పందిస్తూ.. ఒక్కసారి కమిట్ అయితే నా మాట నేనే వినను అంటూ పోకిరిలోని డైలాగ్‌ను కామెంట్ చేశారు. ప్రియాంకచోప్రా స్పందిస్తూ.. ఫైనల్లీ అంటూ రాసుకోచ్చింది.

# ఐసీసీ బెస్ట్ టీ20 టీమ్...





- కెప్టెన్‌గా రోహిత్ శర్మ..!

బలగం టీవి, హైదరాబాద్

అంతర్జాతీయ క్రికెట్ నియంత్రణ మండలి2024 సంవత్సరానికి టీ20 బెస్ట్ టీమ్‌ను శనివారం ప్రకటించింది. ఈ జట్టులో నలుగురు భారతీయ ఆటగాళ్లకు చోటు దక్కింది. గతేడాది టీ20 ప్రపంచకప్ గెలిచిన ప్లేయర్స్‌లో నుంచి ఇద్దరు ఈ జాబితాలో ఉన్నారు. జట్టు కెప్టెన్‌గా రోహిత్ శర్మను ఎంపిక చేసింది. భారత్ నుంచి రోహిత్‌తో పాటు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, పేసర్ జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ ఉన్నారు.

ఇక వుమెన్స్ జట్టులో ముగ్గురు భారత ప్లేయర్‌కు చోటు దక్కింది. స్మృతి మం ధాన, రిచా ఘోష్, దీప్తి శర్మ బెస్ట్ టీమ్‌లో ఐసీసీ చోటు కల్పించింది. అత్యధికంగా భారత జట్టు నుంచి ముగ్గురు, దక్షిణాఫ్రికా నుంచి ఇద్దరికి చోటు దక్కగా.. జట్టు కెప్టెన్సీగా సౌతాఫ్రికా ప్లేయర్ ఎల్ వోల్వార్డ్‌ను ఎంపిక చేసింది.

మెన్స్ జట్టులో భారత్ నుంచి నలుగురు, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, పాకిస్తాన్, వెస్టిండీస్, ఆఫ్ఘనిస్తాన్, శ్రీలంక, జింబాబ్వే నుంచి ఒక్కొక్కరు ఎంపికయ్యారు. జట్టులో ఆస్ట్రేలియాకు చెందిన ట్రావిస్ హెడ్, ఇంగ్లండ్‌కు చెందిన ఫిల్ సాల్ట్, వెస్టిండీస్‌కు చెందిన నికోలస్ పూరన్ (వికెట్ కీపర్), ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన రషీద్ ఖాన్, శ్రీలంకకు చెందిన వనిందు హసరంగా, జింబాబ్వేకు ప్లేయర్ సికందర్ చోటు దక్కించుకున్నారు. గతేడాది ప్రపంచ కప్‌లో తొలిరౌండ్‌లోనే ఇంటి ముఖం పట్టిన పాకిస్థాన్ జట్టు కెప్టెన్ బాబర్ అజామ్ సైతం టీ20 బెస్ట్ ప్లేయింగ్ 11లో చోటు దక్కించుకోవడం విశేషం.



### ఐసీసీ మెన్స్ టీమ్ ఆఫ్ ది ఇయర్ 2024

రోహిత్ శర్మ (కెప్టెన్-భారత్), ట్రావిస్ హెడ్ (ఆస్ట్రేలియా), ఫిల్ సాల్ట్ (ఇంగ్లండ్), బాబర్ అజామ్ (పాకిస్థాన్), నికోలస్ పూరన్ (వికెట్ కీపర్), సికందర్ రజా (జింబాబ్వే), హార్దిక్ పాండ్యా (భారత్), రషీద్ ఖాన్ (ఆఫ్ఘనిస్థాన్), వనిందు హసరంగా (శ్రీలంక), జస్ప్రీత్ బుమ్రా (భారత్), అర్ష్‌దీప్ సింగ్ (భారత్).

### ఐసీసీ ఉమెన్స్ టీ20 టీమ్ ఆఫ్ ది ఇయర్ 2024

ఎల్ వోల్వార్డ్ (కెప్టెన్-దక్షిణాఫ్రికా), మారిజాన్ కాప్ (దక్షిణాఫ్రికా), స్మృతి మంధాన (భారత్), రిచా ఘోష్ (వికెట్ కీపర్-భారత్), దీప్తి శర్మ (భారత్), చమరి అటపట్టు (శ్రీలంక), హేలీ మాథ్యూస్ (వెస్టిండీస్), నాట్ సెవార్డ్ బ్రంట్ (ఇంగ్లాండ్), మెల్లీ కర్ (ఆస్ట్రేలియా), ఓర్లా ప్రెండర్‌గాస్ట్ (ఐర్లాండ్), సాడియా ఇక్బాల్ (పాకిస్థాన్).

## చరిత్ర సృష్టించిన పాక్ స్పిన్నర్



బలగం టీవి, హైదరాబాద్

పాకిస్థాన్ స్పిన్నర్ నోమన్ అలీ చరిత్ర సృష్టించాడు. ముల్తాన్ వేదికగా వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో ఈ స్పిన్నర్ హ్యాట్రిక్ వికెట్లతో అదరగొట్టాడు. హ్యాట్రిక్ తీసిన తొలి పాకిస్థాన్ బౌలర్‌గా అతడు రికార్డుల్లోకి ఎక్కాడు. 1952లో మొదటి టెస్ట్ మ్యాచ్ ఆడినప్పటి నుంచి ఇప్పటిదాకా ఆ టీమ్ తరపున ఒక్క స్పిన్నర్ కూడా సుదీర్ఘ ఫార్మాట్‌లో హ్యాట్రిక్ వికెట్లు తీయలేదు. 73 ఏళ్ల పాక్ టెస్ట్ చరిత్రలో ఈ ఘనత సాధించిన ఏకైక స్పిన్ బౌలర్‌గా అతడు ఆల్‌టైమ్ రికార్డ్ క్రియేట్ చేశాడు. విండీస్‌తో మ్యాచ్‌లో వరుసగా 3 బంతుల్లో జస్టిన్ గ్రీవ్స్, టెవిన్ ఇమ్లాచ్, కెవిన్ సింక్లెయిర్ వికెట్లు తీసి సంచలనం సృష్టించాడు నోమన్ అలీ. ముల్తాన్ టెస్ట్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన విండీస్ 41.1 ఓవర్లలో 163 పరుగులకు కుప్పకూలింది. హ్యాట్రిక్ హీరో నోమన్ అలీ (6/41)తో పాటు సాజిద్ ఖాన్ (2/64) పర్యాటక జట్టు నడ్డి విరిచారు. కాశిఫ్ అలీ, అబ్రార్ అహ్మద్ చెరో వికెట్‌తో వారిద్దరికీ మంచి సహకారం అందించారు. ఆ తర్వాత బ్యాటింగ్ స్టార్ట్ చేసిన ఆతిథ్య జట్టు 154 పరుగులే చేయగలిగింది. స్పిన్నర్ గుడకేష్ మోతీ (3/49)తో పాటు పేసర్లు జోమెల్ వారికన్ (4/43), కీమర్ రోచ్ (2/15) అద్భుతంగా బౌలింగ్ చేసి పాక్‌ను కట్టడి చేశారు. పాక్‌కు 9 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది.